క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: విద్యుత్ సబ్‌స్టేషన్లలో నిర్వహణ పనులు చేస్తున్నందున ఈనెల 17న వరంగల్ వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. ఆజంజాహి మిల్స్, వరంగల్ స్టేషన్‌రోడ్డు, ఖిలా వరంగల్ రోడ్డు, గొర్రెకుంట, ఉర్సు, శంభునిపేట, మామునూరు, బొల్లికుంట, పోతన, కేఎంసీ, పోచమ్మమైదాన్, ఏనుమాముల, ఆరెపల్లి, దేశాయిపేట సబ్‌స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బాక్సింగ్ క్రీడాకారిణికి అభినందన



హసన్‌పర్తి / వరంగల్ స్పోర్ట్స్ : జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన శీలం తనుశ్రీ ఎంపికైంది. ఈనెల 18నుంచి 26వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు కోచ్ శ్యాంసుందర్ తెలిపారు. ఈ సందర్భంగా తనుశ్రీని స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, తదితరులు శనివారం అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ మాజీ సెక్రటరీ స్వామి చరణ్, సీనియర్ బాక్సర్లు ప్రేమ్‌సాగర్, శశికాంత్, పార్థసారథి, క్రాంతి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

వరంగల్: వరంగల్ కాశిబుగ్గ, ఎల్‌బీ.నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు జాతీయ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చి లెవల్ -1, లెవల్ -2లో ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాజశ్రీ తెలిపారు. ఈపరీక్షలో తమ పాఠశాలల విద్యార్థులు స్పెషల్ ప్రైజ్‌లు 2, కన్సోలేషన్ ప్రైజ్‌లు 81, గోల్డ్ మెడల్స్ 147, మెరిట్ సర్టిఫికెట్లు 235 మంది సాధించగా, 6వ తరగతి విద్యార్థి సాయి భరద్వాజ్ లాప్‌ట్యాప్ గెలుచుకున్నాడని అన్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ రంజిత్, సి బ్యాచ్ ఇన్‌చార్జ్ జనార్దన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ ఒలింపియాడ్‌కు ఎంపిక



కాజీపేట రూరల్: ముంబాయిలోని ప్రతిష్టాత్మక హెచ్‌బీసీఎస్ఈ సంస్థ నిర్వహించిన ఐఎంఒటీసీ (ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్ ట్రైనింగ్ క్యాంప్)కు దేశంలో 45 మంది విద్యార్థులు ఎంపిక కాగా, అందులో తమ పాఠశాల నుంచి వేదచరణ్ రెడ్డి ఎంపికయ్యారని ఐఐటీ అకడమీ డైరెక్టర్ రాజేంద్రకుమార్ తెలిపారు. ఒలింపియాడ్‌కు అవసరమైన శిక్షణను కాజీపేటలోని నాగేశ్వరరావు ఐఐటీ అకాడమిలో ఆన్‌లైన్‌లో ఇచ్చినట్లు తెలిపారు. ఆ విద్యార్థిని పలువురు అభినందించారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి



హసన్‌పర్తి: ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు జయంతిని హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం నిర్వహించారు. హసన్‌పర్తి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శ్యాంసుందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమాదేవి, క్లబ్ కోశాధికారి నాగమళ్ల మాధవ్, క్లబ్ మాజీ అధ్యక్షులు నాగమళ్ల సుధీర్, గొరిశెట్టి కృష్ణమూర్తి, సతీష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలంలోని సీతంపేట - బాహుపేట, పెంబర్తి - అంబాల మధ్య సీసీ నిర్మాణ రోడ్డు పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈమేరకు రోడ్డు పక్కన ఉన్న చెట్లను తొలగించారు. సుమారు రూ.1.75 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేయగా, పనులు శనివారం ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టీజీ పేరుతో వాహన రిజిస్ట్రేషన్లు

ఖిలా వరంగల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో వాహన రిజిస్ట్రేషన్లు టీఎస్ నుంచి టీజీగా మార్పు చెందిన విషయం తెలిసిందే. ఈక్రమంలో వరంగల్ రవాణాశాఖలో టీజీ 24 సిరీస్ ప్రారంభం కావడంతో వాహన రిజిస్ట్రేషన్లు శనివారం జోరందుకున్నాయి. అధిక మొత్తం చెల్లించి వాహనదారులు ఫ్యాన్సీ నంబర్లను ఎంచుకున్నారు.

వంద రోజుల్లోనే మార్పు తీసుకొచ్చాం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు
- బీటీరోడ్డు, ఇతర అభివృద్ధి పనులు ప్రారంభం
- పరకాలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీపీ స్వర్ణలత



ఐనవోలు : అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

ఐనవోలు : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ప్రజలు కోరుకున్న మార్పును తీసుకొచ్చామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మండలంలోని కొండపర్తి గ్రామంలో రూ.8.7 లక్షల నిధులతో చేపడుతున్న కట్ట మరమ్మతు పనులు, చింతకుంట క్రాస్ నుంచి కొండపర్తి వరకు రూ. 2.9 కోట్లతో చేపడుతున్న బీటీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని స్థితికి దిగదార్చి రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీకి అప్పగించిందన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నట్లు చెప్పారు. ఎన్ని ప్రతికూలతలు ఎదురైనా ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటుందనే విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలవాలని అన్నారు. ఇతర పార్టీల మాయ మాటలను నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్, నాయకులు మార్నేని వెంకటేశ్వర్‌రావు, బండి మహేందర్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



పరకాల : వాటర్‌గ్రిడ్ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

పరకాల : మండలంలోని వివిధ గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ఎస్‌డీఎఫ్ నిధులను మంజూరు చేసేందుకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ప్రభుత్వం కృషి చేయడం సంతోషకరమని ఎంపీపీ టి.స్వర్ణలత, పీఏసీఎస్ డైరెక్టర్ కట్కూరి దేవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్లక్‌పేట, లక్ష్మీపురం, హైబోతుపల్లి, వెంకటాపురం, వెల్లంపల్లి, కామారెడ్డిపల్లి, పైడిపల్లి, నాగారం గ్రామాల్లో రూ.2కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులతో రోడ్లు, వాటర్‌గ్రిడ్, చెరువు కట్టల మరమ్మతు, డ్రెయినేజీ నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేసిన ఎమ్మెల్యే రేవూరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లక్‌పేట, లక్ష్మీపురం ఎంపీటీసీ సభ్యులు బొజ్జం రజిత, పల్లెబోయిన సునీత, డీసీసీ వీవర్స్ సెల్‌చైర్మన్ దాసరి భిక్షపతి, కాంగ్రెస్ నాయకులు అల్లం రఘునారాయణ, రాజేశ్వర్‌రావు, రాజు, అశోక్, నరేష్, గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్లు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లు ట్రాఫిక్‌రూల్స్ పాటించాలి



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై వీరభద్రరావు

కమలాపూర్ : ఆటోడ్రైవర్లు ట్రాఫిక్‌రూల్స్ పాటించాలని ఎస్సై వీరభద్రరావు సూచించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో శనివారం ఆయన ఆటోడ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహన ఇన్సూరెన్స్, ఆర్సీ, అవసరమైన ఇతర ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ రూల్స్, ధ్రువపత్రాల ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించి ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే పోలీస్‌లకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పాషా, భాస్కర్, వెంకటరమణ, పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ ‘ఉపాధి’ కల్పించాలి

- డీఆర్డీఓ నాగపద్మజ



కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీఓ

శాయంపేట : మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను డీఆర్డీఓ నాగపద్మజ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని కొత్తగట్టుసింగారంలో చెరువు పూడికతీత పనులను, నర్సరీ, తహరాపూర్, శాయంపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎండకు మొక్కలు వాడిపోకుండా గ్రీన్‌నెట్ ఏర్పాటు చేయాలని, వాచర్‌తో మొక్కలకు నీరు పట్టించాలని సూచించారు. ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెరిగేలా చూడాలని ఆదేశించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయానికి రాగా ఏపీఓ కీర్తి అనిత పూలమొక్క అందించి చేనేతవస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఫణిచంద్ర, ఏపీఎం శ్రీధర్‌రెడ్డి, ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ రజిత

కమలాపూర్ : మండలంలోని మర్రిపల్లిగూడెంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో నూతనంగా నిర్మించనున్న డ్రెయినేజీ నిర్మాణ పనులను ఎంపీటీసీ సభ్యురాలు ఇనుగాల రజితరవీందర్ శనివారం ప్రారంభించారు. లాండిగె రాధ ఇంటి నుంచి ఇంగ్లె లక్ష్మణ్ ఇంటి వరకు, అక్కడి నుంచి తాటిపల్లి భాస్కర్ ఇంటి వరకు రూ.4 లక్షలతో రెండు డ్రెయినేజీలు నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ, పద్మశాలి కులసంఘం అధ్యక్షుడు పొండ్ల రమేష్, నాయకులు పులితిరుపతి, పులి పెద్దకుమారస్వామి, పోలోజు రాజేశం, సల్వాల శ్రీనివాస్, కుసుంబ కిషన్‌రావు, రిక్కల నారాయణరెడ్డి, ఇనుగాల భిక్షపతి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌కు చెందిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు శుక్రవారంరాత్రి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సుమారు 50 మంది యువకులు పార్టీలో చేరగా హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ వారికి కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో కరుణాకర్, ఎల్తూరి ప్రసాద్, పవన్‌కల్యాణ్, శ్రీనివాస్, రంజిత్, వెంకటేష్, మధు, సాగర్, కిశోర్, రమేష్, కొమురయ్య, నటరాజ్, కుమార్, చింటూ, అనిల్ ఉన్నారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై బీఆర్ఎస్ నిరసన



ఎల్కతుర్తి : నల్లబ్యాడ్జీలతో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి ముల్కనూర్‌లో..



పరకాల : బస్టాండ్ కూడలిలో ఆందోళన చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఎల్కతుర్తి : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపిస్తూ శనివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరు, ఎల్కతుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపం వద్ద బీఆర్ఎస్ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి స్థానిక పెట్రోల్ బంక్ నుంచి అంబేడ్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ వంగ రవీందర్, పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయ లబ్ధికోసం కాంగ్రెస్, బీజేపీ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఎంపీపీలు అనితా, స్వప్న, వైస్ ఎంపీపీ నగేష్, సింగిల్‌విండో చైర్మన్ రవీందర్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

శాయంపేట : భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఐటీ, ఈడీ అధికారులు అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని భారత జాగృతి యువజన రాష్ట్ర నాయకుడు అమ్మఅశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసు సుప్రీంకోర్టులో ఉండగానే, ఐటీ, ఈడీ అధికారులు దాడులు జరపడం హేయమైన చర్య అని మండిపడ్డారు.

పరకాల : బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను నైతికంగా దెబ్బతీసేందుకే కేంద్రం దుర్మార్గపు చర్యలకు పాల్పడుతుందని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ మడికొండ శ్రీను, మండల అధ్యక్షుడు చింతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అధికారులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ స్థానిక బస్టాండ్ కూడలిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నాకు గిదారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో పోలీసులు జోక్యం చేసుకొని బలవంతంగా విరమింపజేశారు. ప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న మోదీ సర్కార్‌కు రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. వ్యవసాయ కమిటీ మార్కెట్ మాజీ చైర్మన్ సారంగపాణి, నడికూడ మండల అధ్యక్షుడు చంద్రమౌళి, మాదారం పీఏసీఎస్ చైర్మన్ లింగమూర్తి, పోచారం ఎంపీటీసీ రమేష్, నాయకులు భిక్షపతి, ప్రకాశ్‌రావు, చిరంజీవి, కళావతి పాల్గొన్నారు.

బాధితులకు బియ్యం అందజేత



వేలేరు : మండలంలోని పీచర గ్రామానికి చెందిన బత్తిని వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మదర్‌థెరిస్సా ఫౌండేషన్ సభ్యులు రఘునాయకుల ప్రమోద్ రెడ్డి, పైండ్ల రాకేష్‌రెడ్డి శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. 50 కేజీల చొప్పున బియ్యం అందించారు. రమేష్, శ్రీధర్‌రెడ్డి, రాజిరెడ్డి, శ్రావణ్‌రెడ్డి, శ్రీనివాస్, రోహిత్, నవీన్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వేలేరు : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పీచర గ్రామానికి చెందిన శివరాత్రి కొమురయ్య అనుమతులు లేకుండా ఇసుక ట్రాక్టర్‌తో పీచర నుంచి వేలేరు వైపు వెళ్తుండగా శాలపల్లి గ్రామంలో పట్టుకున్నట్లు తెలిపారు. సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి శివనగర్‌కు చెందిన 20 ఏళ్ల యువతి రక్షిత శనివారం అదృశ్యమైంది. ఇన్‌స్పెక్టర్ మల్లయ్య కథనం ప్రకారం వరంగల్ శివనగర్‌కు చెందిన ఓరుగంటి శ్రీనివాస్ ఆటో నడిపించేందుకు, అతని భార్య కూలిపనికి వెళ్లారు. ఈక్రమంలో ఆ దంపతుల కుమార్తె రక్షిత మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దాంతో తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

19 ఏళ్ల యువతి..

స్టేషన్‌పరిధిలోని పుల్లయ్యకుంటకు చెందిన ఓ యువతి శుక్రవారం మధ్యాహ్నం అదృశ్యమైంది. ఇన్‌స్పెక్టర్ మల్లయ్య కథనం ప్రకారం వరంగల్ ఆర్టీఏ కార్యాలయ సమీప కాలనీ పుల్లయ్యకుంటకు చెందిన 19ఏళ్ల అలేఖ్య ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ పూర్తి చేసింది. పరీక్షలు రాసి 14న ఇంటికి చేరింది. శుక్రవారం మధ్యాహ్నం కూరగాయలు తెస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆచూకీ లభించకపోవడంతో ఆమె అక్క కంజర్ల అఖిల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పొదుపుతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న సత్యనారాయణ

శాయంపేట : పొదుపు చేయడం ద్వారానే ఆర్థికాభివృద్ధి సాధ్యమని శ్రీరామ పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు కడివెండి సత్యనారాయణ అన్నారు. మండలంలోని నేరేడుపల్లిలో శ్రీరామ పొదుపు సంఘం 28వ వార్షిక మహాసభను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 1995 సంవత్సరంలో ఏర్పడిన సంఘం ఇప్పటివరకూ 653 మందితో రూ.2.91 కోట్ల నిధులు సమకూర్చినట్లు తెలిపారు. 2023 ఆర్థిక సంవత్సరంలో రూ. 22 లక్షల మిగులు వచ్చిందన్నారు. భవిష్యత్తులో సభ్యత్వాన్ని పెంచి అప్పు అర్హత కూడా పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు మహ్మద్ ఉస్మాన్, సంఘ ఉపాధ్యక్షులు మొత్కూరి భాస్కర్, ఆకుతోట పూర్ణచందర్, సయ్యద్ వలి, తాత మోహన్, దొడ్డిపాక రాజు, మోహన్, కృష్ణమూర్తి, రాంబాబు, రవి, రాజ్‌కుమార్, రాజు, మోహన్, సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం లింగారావు

ఐనవోలు : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు స్వయంసహాయక మహిళా సంఘాలు కృషి చేయాలని హెచ్‌ఎం లింగారావు సూచించారు. ఉడుతగూడెం ప్రభుత్వ పాఠశాలలో శనివారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. గ్రామానికి చెందిన మహిళా సంఘాల అధ్యక్షురాలు పాఠశాలకు చైర్‌పర్సన్‌గా, హెచ్‌ఎంను కన్వీనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. అందుకనుగుణంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఏర్పాటుకు ప్రతి తరగతి నుంచి ముగ్గురు విద్యార్థుల తల్లులను ఎంపిక చేసుకోవాలని, అందులో మహిళా సంఘాల్లో సభ్యులు ఉండాలని వివరించారు. ఇక మీదట పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం ఎకౌంట్లో డబ్బులు జమ చేస్తుందని చెప్పారు. మహిళా సంఘాల సభ్యులు పాఠశాల అవసరాలను గుర్తించి తదనుగుణంగా ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులకు యూనిఫాం కుట్టించే బాధ్యతతో పాటు పాఠశాలలను పర్యవేక్షించే బాధ్యతను కూడా మహిళలకు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్, మహిళా సంఘాలతో ఏర్పాటు చేసిన అకౌంట్‌లో పాఠశాలకు రూ.1.95 లక్షల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఈ నిధులతో విద్యుత్, టాయిలెట్స్, తాగునీటి సదుపాయాలను కల్పించేందుకు ప్రొసీడింగ్ ఇచ్చారని వెల్లడించారు. అనంతరం మహిళా సంఘాల సీఏ మేక సునీత మాట్లాడుతూ.. గ్రామంలో 19 సంఘాలు ఉండగా వాటికి అధ్యక్షురాలుగా బరిగెల సుమలత వ్యవహరిస్తున్నారని, పాఠశాలకు చైర్ పర్సన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ప్రణీత, రాధిక తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, తహసీల్దార్

ఐనవోలు : పేదప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వినియోగించుకోవాలని ఎంపీపీ మార్నేని మధుమతి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 94 మంది లబ్ధిదారులకు చెక్కులను అందించామన్నారు. రానున్న రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో పాటు నూతన రేషన్ కార్డులను జారీ చేయనున్నట్లు తెలిపారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఇప్పటికే ఉచిత బస్సు, 500లకే గ్యాస్ ఇవ్వడంతో పాటు గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందజేస్తున్నామని చెప్పారు. మహిళలు తీసుకున్న బ్యాంకు లింకేజీ రుణాలకు ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి సున్నా వడ్డీ అమలవుతుందన్నారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం కూడా మహిళలకు ఇవ్వనటువంటి ప్రాధాన్యత కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందని అన్నారు. మహిళలు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీటీసీలు కల్పన, రమేష్, మహేందర్, రెవెన్యూ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్



నడికూడ : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో శనివారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యం దశలో పిల్లలకు విద్యను ఏవిధంగా బోధిస్తే అర్థమవుతుందో తల్లుకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చిర్రబోయిన శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్ సంపూర్ణ, ఆయాలు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల మాయాజాలం

- రూ.23,85,457లకు కుచ్చుటోపి

ధర్మసాగర్ : ఇంటివద్దే ఉంటూ ఆన్‌లైన్ పార్ట్‌టైం ఉద్యోగం చేయచ్చు అని నమ్మించిన సైబర్ నేరగాళ్లు ఏకంగా రూ.23,85,457 కుచ్చుటోపి పెట్టారు. మోసపోయానని ఆలస్యంగా తెలుసుకున్న సదరు బాధితుడు నెత్తినోరు బాదుకుంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. స్థానిక సీఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలానికి చెందిన ఓ వ్యక్తి వాట్సప్ నంబర్‌కు ఓ మెస్సెజ్ వచ్చింది. ఆన్‌లైన్ ఉద్యోగం చేస్తూ ఇంటివద్దే ఉంటూ డబ్బు సంపాదించాలంటే ఈ లింక్‌ను క్లిక్ చేసి అప్లికేషన్ చేయాలని మెస్సెజ్‌లో పేర్కొని ఉంది. దీంతో సదరు వ్యక్తి డబ్బులు సంపాదించే అవకాశం ఉందని చెప్పడంతో అతని మాటలు నమ్మాడు. ఉద్యోగం పొందాలంటే కొన్ని డబ్బులు కట్టాలని సూచించగా ఉద్యోగం వస్తుందనే ఆశతో మొదటగా కొన్ని డబ్బులు ఆన్‌లైన్ చేశాడు. రోజులు గడిచేకొద్దీ ఉద్యోగం రాకపోగా తన దగ్గర నుంచి డబ్బులు తీసుకుంటున్నట్లు గుర్తించాడు. అప్పటికే రూ. 23,85,457 లక్షలు ఆ గుర్తు తెలియని వ్యక్తికి ముట్టజెప్పాడు. దీంతో మోసపోయానని తెలుసుకున్న బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అదే విధంగా మరో వ్యక్తి ఫేస్‌బుక్‌లో కోడి పుంజులు అమ్ముతామనే ప్రకటన చూసి రూ. 3వేలు గుర్తుతెలియని వ్యక్తికి పంపించి మోసపోయినట్లు తెలిపారు. కొరియర్ బాక్స్‌లో కోడి పుంజుకి బదులు పాతబట్టలు పంపించినట్లు తెలిపారు. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్లు చేస్తే స్పందించొద్దని సూచించారు. సైబర్ నేరగాళ్లు ఫోన్‌లు చేసి ఓటీపీలు అడిగితే నిరాకరించాలని చెప్పారు.

తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని అనేక అక్రమాలు

కేయూ క్యాంపస్: బ్యూటీపార్లర్ నడిపి జీవనం గడిపిన చరిత్రగల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. తన తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని రాష్ట్రంలో అనేక అవకతవకలు, అక్రమాలకు పాల్పడ్డారని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ఆరోపించారు. కాకతీయ యూనివర్సిటీలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో కీలకపాత్ర పోషించి అడ్డంగా దొరికిపోయి, చట్టపరంగా కవిత అరెస్టును ప్రజలు సాధారణ విషయంగా పరిగణించాలని సూచించారు. సాధారణ పౌరులు ఏ చిన్న పొరపాటు చేసినా కేసీఆర్ పాలనలో చిత్రహింసలకు గురిచేసిన విషయాలు బీఆర్ఎస్‌వీ నాయకులు మరిచిపోయారని ఎద్దేవాచేశారు. రాక్షస పాలన కొనసాగించిన బీఆర్ఎస్ నేతలు.. కల్వకుంట్ల కవిత అరెస్టుకావటం జీర్ణించుకోలేక రోడ్లపైకి వచ్చి రాస్తారోకో చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇలాంటి వాటిని ప్రజలు ఖండించాలన్నారు.

హక్కులపై అవగాహన కలిగిఉండాలి



వేలేరు : వినియోగదారులు వారి హక్కులపై అవగాహన కలిగి ఉండాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ రౌతు అజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో ప్రపంచ వినియోగదారుల హక్కు దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. డీసీపీసీ అధ్యక్షుడు ఠాకూర్ రతన్‌సింగ్ హాజరై ఆర్టీఫిషియల్ ఇంటలిజెన్స్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. దాంతోపాటు వినియోగదారుల హక్కులు, బాధ్యతల గురించి వివరించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, డీసీపీసీ సభ్యులను సన్మానించారు.